క్లుప్తంగా

పిచ్చిమొక్కల తొలగింపు


పిచ్చి మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

నార్నూర్: వర్షకాలం గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్యం, క్లోరినేషన్ సమస్యలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆదివారం 'సాక్షి' దినపత్రికల్లో 'పేరుకుపోయిన చెత్తాచెదారం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే పనులు చేయించాలని పంచాయతీ కార్యదర్శి లవ్‌కుమార్‌ను అధికారులు ఆదేశించారు. దీంతో సిబ్బందితో గ్రామంలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. వర్షాకాలం ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రమేశ్ ఆదేశించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో ఆడే గజేందర్

నేరడిగొండ: గుడిహత్నూర్ మండలం కొల్హారి గ్రామస్తులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు బాలాజీ పటేల్, మాజీ ఎంపీటీసీ అంకాతి రవి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఆడే గజేందర్ సమక్షంలో చేరగా.. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజాపాలనలో కొత్తరేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రైతులకు రుణమాఫీ ఇస్తుందన్నారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆడే వసంత్ రావు, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, స్వామి, బద్దం పోతారెడ్డి, హీరాసింగ్, మౌలానా, ఎండీ సద్దాం, తీగల విలాస్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


ఎస్సై వెంకటకృష్ణ

రెబ్బెన: రెబ్బెన నూతన ఎస్సైగా వెంకటకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన డి.చంద్రశేఖర్ కొటాలకు బదిలీ కాగా ఆయన స్థానంలో రామగుండం కమిషనరేట్‌లో వీఆర్‌గా ఉన్న వెంకటకృష్ణ రెబ్బెన ఎస్‌హెచ్‌వోగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యూరియా కోసం రైతుల క్యూ


ముఖర(బి)లో క్యూలో నిలుచున్న రైతులు

ఇచ్చోడ: మండలంలోని ముఖర(బి) ప్రాథమిక సహకార సంఘం వద్ద ఆదివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఉదయం 6 గంటల నుంచి రైతులు క్యూలో నిలుచున్నారు. యూరియా బస్తాతో పాటు అదనంగా నానో యూరియాను అంటగట్టడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి రైతులకు యూరియా సరఫరా చేసేలా చూశారు. ఆందోళనలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


అవగాహన కల్పిస్తున్న డీసీపీవో కౌన్సిలర్ పద్మ

ఆదిలాబాద్‌టౌన్: బాల్య వివాహాలతో అనర్థాలు జరుగుతాయని డీసీపీవో కౌన్సిలర్ పద్మ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో చర్చిల్లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో ఆడపిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఉంటాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో న్యూలైఫ్ ఫిలోషిప్ చర్చి పాస్టర్ జయంత్ కుమార్, వినోద్, సంపత్, కిరణ్, సౌజన్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాలన.. పైసల్లేక హైరానా!


గోయగాం గ్రామ పంచాయతీ కార్యాలయం

- ఒక్కో ప్రత్యేకాధికారికి 4 జీపీల బాధ్యతలు
- సొంత శాఖల్లో పనిభారం
- సమావేశాలకే పరిమితం
- నిధుల్లేక ఇబ్బందులు

కెరమెరి: గ్రామ పంచాయతీల్లో ఏడాదిన్నరగా ప్రత్యేక పాలన కొనసాగుతోంది. కెరమెరి మండలంలో 31 పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. ఒక్కొక్కరికి 4, 5 పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు తమ సొంత శాఖల్లోనే పనిభారంతో పల్లెలపై దృష్టిసారించడం లేదు. ఒకవేళ వచ్చిన సమావేశాలకే పరిమితమవుతున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఏడాదిన్నరగా నిలిచిన నిధులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఫైనాన్స్ కమీషన్ (సీఎఫ్‌సీ), రాష్ట్ర పరిధిలోని ఎస్ఎఫ్‌సీ నిధులు ఏడాదిన్నరగా అందడం లేదు. దీంతో పంచాయతీల్లో నయాపైసా లేక పాలన గాడితప్పింది. మరోవైపు నిధుల్లేక జీతం నుంచి, అప్పుతెచ్చి గ్రామాల నిర్వహణకు వెచ్చిస్తున్నామని, వాటిని ఎలా తీర్చాలని కార్యదర్శులు హైరానా చెందుతున్నారు. గ్రామాల్లో పన్నులు ద్వారా ఆదాయం వస్తుంది. కార్యదర్శులు వసూళ్లు చేసి ట్రెజరీలో జమ చేయాలి. తిరిగి వెనక్కి చెక్కురూపంలో బ్యాంకుల నుంచి తీసుకురావాలి. కాని అవి కూడా రాకపోతుండడం గమనార్హం.

నిధులు అవసరం..

గ్రామాల్లో నెల రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ చర్యలు, బ్లీచింగ్ పౌడర్, పైప్‌లైన్ల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, పల్లె ప్రకృతివనాల నిర్వహణ, బోర్లు ట్రాక్టర్ల మరమ్మతు, ఇలా ఏ దేనికైనా నిధులు అవసరం. ప్రజలకు ఏ సమస్య వచ్చినా కార్యదర్శికి చెబుతారు. పరిష్కారానికి ఆయన ప్రత్యేకాధికారికి తెలిపిన పనులన్ని నిధులతో ముడిపడి ఉన్నవి కావడంతో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది.

> **ఇబ్బంది లేకుండా చూస్తున్నాం**
>
> 
>
> అన్ని పంచాయతీలకు ప్రత్యేకాధికారులు ఉన్నారు. ఎప్పటికప్పుడు అత్యవసరం అనుకుంటే పంచాయతీలను సందర్శిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు చేశాం. నిధుల విడుదల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశం. మల్టీపర్పస్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు అందిస్తుంది.
>
> – ఎండీ అంజద్‌పాషా, ఎంపీడీవో

ఖాతాల్లో జమ చేయరూ!

- పాఠశాలల నిర్వహణకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- హెచ్ఎంల ఖాతాల్లో జమకాని వైనం
- సొంత డబ్బులు ఖర్చు చేస్తున్న ప్రధానోపాధ్యాయులు


ఆసిఫాబాద్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

ఆసిఫాబాద్‌రూరల్: సర్కారు బడి నిర్వహణ నిధులు నేటి వరకు రాకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2025 –26 విద్యా సంవత్సరం ప్రారంభమైన నాలుగు నెలలు గడుస్తుండటంతో ఖర్చులు తమ జేబు నుంచి పెట్టుకోవాల్సి వస్తుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. జూలై తొలి వారంలో మంజూరు కావాల్సిన నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండడంతో హెచ్ఎంలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఏటా విద్యా సంవత్సరంలో రెండుసార్లు పాఠశాలలకు నిధులు కేటాయిస్తారు. వీటితో చాక్‌పీసులు, ప్రయోగశాలకు సంబంధించిన సామగ్రి, రిజిస్టర్లు, తాగునీరు, జాతీయ పండుగలు, పరీక్ష నిర్వహణ వంటి ఇతర పనులకు ఖర్చు చేస్తారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలకు నిధులు విడుదల చేస్తారు. జిల్లాలో మొత్తం 721 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 561, ప్రాథమికోన్నత పాఠశాలలు 100, ఉన్నత పాఠశాలలు 60 ఉన్నాయి. వీటిలో 39,246 మంది విద్యార్థులు చదువుతున్నారు. 30 మందిలోపు ఉంటే రూ. 10 వేలు, 31 నుంచి 100 మంది ఉంటే రూ.25 వేలు, 100 నుంచి 250 మందికి రూ. 50 వేలు, 251 నుంచి 1000 మంది ఉంటే రూ.75 వేలు, 1000కి పైగా ఉంటే రూ.లక్ష వరకు నిధులను పాఠశాలలకు కేటాయిస్తారు. దానితో పాటు బడిబాట కార్యక్రమానికి రూ.1000, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌కు రూ.1000, క్రీడల నిర్వహణకు పీఎస్‌కు రూ.5 వేలు, యూపీఎస్‌కు రూ.10 వేలు, జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ. 25 వేలు కేటాయిస్తారు. ఈ నిధులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయని, కానీ ఖాతాల్లో మాత్రం జమ కాలేదని హెచ్ఎంలు పేర్కొంటున్నారు.

> **ప్రొసీడింగ్ వచ్చింది..**
>
> ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపునకు సంబంధించిన ప్రొసీడింగ్ వచ్చింది. త్వరలోనే పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో పాఠశాల నిర్వహణ నిధులు జమవుతాయి.
>
> – సుభాష్, ఎంఈవో

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

- ముగిసిన సామాజిక తనిఖీ
- తేటతెల్లం కానున్న 238 పనులు

మండలంలోని ఉపాధిహామీ వివరాలు..

యాక్టివ్ జాబ్‌కార్డులు	4,019
మొత్తం కూలీలు	8,502
పనిచేస్తున్న కూలీలు	7,984
పనుల సంఖ్య	238
మొత్తం నిధులు	రూ.4.28 కోట్లు


పిట్టగూడలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

లింగాపూర్: గడిచిన కొన్ని రోజులుగా మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంపై కొనసాగిన సామాజిక తనిఖీలు, గ్రామసభలు ఆదివారం ముగిశాయి. సోమవారం ఉదయం 10 గంటలకు మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 5వ విడత ప్రజావేదిక నిర్వహించనున్నారు. 12వ తేదీ వరకు దాదాపు అన్ని గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో చేసిన పనులు, పనుల కొలతలు తీసుకోవడం పూర్తికాగా 13, 14వ తేదీ నుంచి అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. క్షేత్రస్థాయిల్లో పనులు పరిశీలించిన అనంతరం గ్రామసభలో రికార్డులు తనిఖీ చేశారు. సామాజిక తనిఖీల్లో భాగంగా ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు 238 పనులు గుర్తించారు. వీటిలో మెటీరియల్ పేమెంట్‌తో పాటు మొత్తం నిధులు రూ.4.28 కోట్లు ఖర్చు చేశారు.

> **నిష్పక్షపాతంగా నిర్వహిస్తాం..**
>
> నేడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావేదికను సామరస్యంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తాం. గడిచిన పక్షం రోజులు ఉపాధిలో చేసిన పనుల వద్దకు సామాజిక తనిఖీ బృందం వెళ్లి పరిశీలించింది. పనుల కొలతలు తీసుకున్నారు. వారు నమోదు చేసిన లెక్కలు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులపై ప్రజావేదిక జరగనుంది. – చంద్రయ్య, ఏపీవో, లింగాపూర్

ఏటా మునుగుడే..!

- 'వార్ధా' ఉగ్రరూపం
- నీట మునిగిన పత్తి పంట
- ఆందోళనలో అన్నదాతలు


వీర్దండి శివారులో పత్తిలో చేరిన వరద

కౌటాల: కోటి ఆశలతో పంటలు సాగు చేస్తున్న రైతులు అతివృష్టి, అనావృష్టి కారణంగా ఏటా నష్టాలను చవిచూస్తున్నారు. భారీ వర్షాలు, వరదలు అన్నదాతను నిండా ముంచుతున్నాయి. ప్రాణహిత, వార్ధా పరీవాహక ప్రాంత రైతులకు కన్నీరే మిగులుతోంది. రెండు రోజుల నుంచి జిల్లాలో కురిసిన వర్షాలతో పాటు మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు నదులు ఉప్పొంగి ప్రవహించడంతో నీటమునిగాయి. పూత దశలో ఉన్న పత్తి పూర్తిగా దెబ్బతిన్నది. వరద పెరిగితే చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం, పెంచికల్‌పేట్‌లో పంటలు నీట మునిగే ప్రమాదం ఉంది.

ముంపునకు గురవుతున్న పంటలు..

సిర్పూర్ నియోజకవర్గంలోని సిర్పూర్(టి), కౌటాల మండలాల సరిహద్దులో పెన్‌గంగ, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాల సరిహద్దుల్లో భారీ వర్షాలు కురిసినప్పుడు వరదలు రావడం పరిపాటిగా మారింది. ఏటా జిల్లాతో పాటు మహారాష్ట్ర ఎగువ ప్రాంతాలు, మధ్యప్రదేశ్‌లో కురిసిన వర్షాల ప్రభావంతో నదులు ఉప్పొంగి ప్రవహిస్తాయి. దీనికి తోడు నదులపై ఉన్న ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో మండలాలలోని నది తీరంలోని పంట ముంపునకు గురవుతున్నాయి. గత ఐదేళ్లుగా వరదల్లో తీవ్రత పెరిగిందని అధికారులు అంటున్నారు.

భారీ వర్షాలే కారణం..

కుమురం భీం జిల్లాలో ప్రజలు ఎక్కువగా వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తారు. ఎక్కువగా వరి, పత్తి, కంది, మిర్చి పంటలు సాగు చేస్తారు. వర్షాల కారణంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలు ప్రభావితమవుతున్నాయి. ప్రాణహిత, పెన్‌గంగ నదులకు వచ్చే వరదల కారణంగా కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మండలాల రైతులు నష్టపోతున్నారు. పెన్‌గంగా, వార్ధా, ప్రాణహిత నదులపై మహారాష్ట్రలోని యావత్‌మాల్, చంద్రపూర్, బండారా జిల్లాలో ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రస్తుతం భారీ వర్షాల కారణంగా వార్ధా, ప్రాణహిత నదుల్లో వరద పెరుగుతుంది. దీంతో కౌటాల మండలంలోని తాటిపల్లి, వీర్దండి గ్రామాల్లో వందల ఎకరాల్లో పంటలు నీట మునుగుతాయి. గత నెలలో వరదల కారణంగా జిల్లాలోని కౌటాల, దహెగాం, బెజ్జూర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి, ఆయా మండలాల్లో 315 మంది రైతుల 6,453 ఎకరాల్లో పత్తి, వరి, కంది, పెసర, మిర్చి, జొన్న పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. నష్టపోయిన రైతులను గుర్తించి ఎకరానికి రూ. 10 వేలు చొప్పున పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మరోసారి వరద ముంపుతో పంటల్లో వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాంస్కృతిక గుర్తింపు కార్డులు ఇవ్వాలి


మాట్లాడుతున్న నాగరాజు

ఆసిఫాబాద్‌అర్బన్: బ్యాండ్ వాయిద్యా కళాకారులకు ప్రభుత్వం సాంస్కృతిక గుర్తింపు కార్డులు ఇవ్వాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి గుమ్మరాజు నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాపునగర్ సంఘం కార్యాలయంలో ఆదివారం జిల్లా నాయకుడు శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం బ్యాండ్ కళాకారుల పట్ల చిన్నచూపు చూస్తుందన్నారు. ప్రమాదంలో మరణించిన కళాకారులకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, బ్యాండ్ గ్రూప్‌లకు రూ.5 లక్షల చొప్పున బ్యాంకు ష్యూరిటీ లేకుండా రుణాలు అందించాలని కోరారు. శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ కళాకారుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి, సమ్మయ్య, శంకర్, శ్రీనివాస్, క్రిష్ణ, ధర్మయ్య, మహమ్మద్ ఫారూఖ్, కుమార్, రాజు, రాజేశ్వర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగి ప్రవహిస్తున్న పెన్‌గంగ

- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు


హుడ్కిలి సమీపంలో మునిగిన లోలెవల్ వంతెన

సిర్పూర్(టి): మండలంతో పాటు ఎగువ ప్రాంతంలో ఉన్న మహారాష్ట్రలో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో పెన్‌గంగ ఉధృతంగా ప్రవహిస్తోంది. పెన్‌గంగ నదితో పాటు మండలంలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో మాకిడి, జక్కాపూర్, హుడ్కిలి, వెంకట్రావ్‌పేట్, టోంకిని, పారిగాం, లోనవెల్లి గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పెన్‌గంగ ఉధృతితో సిర్పూర్(టి)–మాకిడి రహదారిలోని హుడ్కిలి గ్రామ సమీపంలోని హుడ్కిలి లోలెవల్ వంతెన మునిగింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలోని వెంకట్రావ్‌పేట్–పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిలోని వంతెన వద్ద పెన్‌గంగ ఉప్పొంగి ప్రవహించడంతో అధికారులు రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ కేంద్రం మంజూరు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం మంజూరైందని ప్రిన్సిపాల్ టి. ప్రతాప్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్య సంవత్సరం నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సులలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోర్సుల అడ్మిషన్ల గడువు సెప్టెంబర్ 26 వరకు పొడిగించినట్లు తెలిపారు. వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని కోరారు.

150 మందికి బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో 150 మంది కరాటే క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. కరాటే సీనియర్ మాస్టర్ కాంబ్లే ముకేశ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన టెస్టింగ్ పరీక్షలు ఉత్సాహంగా సాగాయి. పరిశీలకులుగా ఆకాష్, రాము, సచిన్ వ్యవహరించారు. ఇటీవల ముఖేష్ కుమార్ బ్లాక్ బెల్ట్ ఎనిమిదవ డాన్ తీసుకున్నందుకు పలువురు మాస్టర్లు ఆయనను సన్మానించారు.

పోచమ్మ తల్లికి మొక్కు


మొక్కులు చెల్లిస్తున్న ప్రజలు

లింగాపూర్: మండలంలో ఉత్తర (కార్తె)లో పోచమ్మ తల్లికి ఆదివారం గిరిజనులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పటేల్ పూజారి (గంగు పటేల్) ఏటా పోచమ్మ తల్లిని ఉత్తర కార్తెలో ఏర్పాటు చేస్తారు. ఈ పూజ తర్వాత గ్రామస్తులు వనభోజనాలు నిర్వహిస్తారు.


పూజలు చేస్తున్న మహిళలు

పూర్వ చాత్రోపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం


చాత్రోపాధ్యాయుల సమ్మేళనంలో పాల్గొన్న గురువులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాల, శ్రీనిధి డీఎడ్ కాలేజ్‌లో 2008 –2009 మధ్య చదువుకొన్న పూర్వ చాత్రోపాధ్యాయులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. 16 ఏళ్ల తర్వాత కలుసుకొని ఒకరినొకరు పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను శాలువాలతో సత్కరించారు. అధ్యాపకులు శ్రీనివాస్, గణేశ్, శ్రీకర్, సమ్మిరెడ్డి, మహేశ్, కిరణ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

హిందీపై పట్టు సాధించాలి

కౌటాల: హిందీ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని హెచ్ఎం గోడాం నానాజీ అన్నారు. ఆదివారం హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని గుండాయిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. పోటీ పరీక్షలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నతంగా చదవాలన్నారు. అనంతరం హిందీ ఉపాధ్యాయుడు చౌదరి గుణాకర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నీలబాయి, సిబ్బంది పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

'యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం'


రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కార్యకర్తలతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. రైతులకు కావాల్సిన యూరియా అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. జిల్లాలో తీవ్రమైన యూరియా కొరత ఉన్నప్పటికీ మంత్రులు, కాంగ్రెస్ నాయకులు యూరియా కొరతపై స్పందించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాడ్గే సుభాష్, పాండురంగ్, నర్వడే రమేశ్, తదితరులు పాల్గొన్నారు.